
andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
గురువారం ఉష్ణోగ్రత గరిష్ఠం 31.4 । కనిష్ఠం 23.1
నిర్మల్
జిల్లా వార్తలు
8
శుక్రవారం 20 సెప్టెంబరు 2024




ఇటీవల వర్షాలకు కొట్టుకుపోయిన ఖానాపూర్ తర్లపాడ్ తాత్కాలిక రోడ్డు

రెంకోని వాగుపై వంతెనల నిర్మాణం పూర్తయ్యేనా?




కొట్టుకుపోయిన రెంకోని వాగు
తాత్కాలిక రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు



- రెండు చోట్ల వంతెనల నిర్మాణాలకు గతేడాది నిధుల మంజూరు
- ఖానాపూర్ - తర్లాపాడ్ రోడ్డుపై వంతెన నిర్మాణానికి రూ, 4.70 కోట్లు
- ఖానాపూర్ - దిలావర్‌పూర్ రోడ్డుపై వంతెన నిర్మాణానికి రూ. 5.20 కోట్ల నిధులు మంజూరు
- అక్టోబర్ 2023లో రెండు వంతెనల నిర్మాణానికి అగ్రిమెంట్‌లు పూర్తి
- ఇప్పటి వరకు రెండు వంతెనల వద్ద కేవలం 30శాతం పనులు మాత్రమే పూర్తి
- చేసిన పనులకు సైతం కాంట్రాక్టర్‌లకు అందని బిల్లులు
- ఇంకా పెండింగ్‌లోనే రూ.1.65 కోట్ల బిల్లులు
- ఇటీవల భారీ వర్షాలకు దెబ్బతిన్న తాత్కాలిక రోడ్లు

ఖానాపూర్, సెప్టెంబర్ 19 : ఎన్నోఏళ్లుగా ఖానాపూర్ నియోజకవర్గం లోని ఖానాపూర్, కడెం, దస్తురాబాద్, పెంబి నాలుగు మండలాల ప్రజలు ఎదురు చూస్తున్న రెంకోనివాగుపై వంతెనల నిర్మాణం ఈ ఏడాది కూడా కలగానే మిగిలిపోతుందా అనే అనుమానాలను ఈ ప్రాంత ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. ఖానాపూర్ నుంచి నియోజకవర్గంలోని ఇతర మండలాలకు వెళ్లాలన్నా.. ఇతర మండలాల నుంచి నియోజకవర్గ కేంద్రమైన ఖానాపూర్ పట్టణానికి రావాలన్నా రెంకోని వాగును ఖచ్చితంగా దాటాల్సిన పరిస్థితి ఉంటుంది. ఈ రెంకోని వాగుపై ఖానాపూర్- తర్లాపాడ్ రోడ్డు మధ్యలో గాంధీనగర్ సమీపంలో ఒక చోట, ఖానాపూర్- దిలావర్‌పూర్ రోడ్డుపై అంబేద్కర్‌నగర్ సమీపంలో మరో చోట రెండు లోలెవల్ వంతెనలుండేవి. ప్రతీ వర్షాకాలం కొద్దిపాటి వర్షాలకే రెంకోని వాగు ఉప్పొంగి ప్రవహించి ఈ లోలెవల్ వంతెనలపై నుంచి నీరు పొంగి పొర్లుతుండడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయేవి. ఈ సమస్యను పరిష్కరించాలని నియోజకవర్గ ప్రజలు ఏళ్ల తరబడిగా పాలకులకు మొరపెట్టుకున్నారు. దీంతో గత ప్రభుత్వం రెంకోనివాగుపై రెండు చోట్ల వంతెనల నిర్మాణానికి నిధులు మంజూరీ చేసింది. నిధులు మంజూరీ కావడంతో టెండర్లు పిలిచి గతేడాది అక్టోబర్ మాసంలో అగ్రిమెంట్‌లు పూర్తి చేసుకున్నారు. అగ్రిమెంట్ ప్రక్రియ పూర్తి కాగానే కొద్దిరోజుల పాటు పనులు ప్రారంభం కాలేదు. ఆ తర్వాత తెలంగాణలో కొత్త ప్రభుత్వం ఏర్పడిన వెంటనే స్థానిక ఎమ్మెల్యే వెడమ బొజ్జు వంతెన నిర్మాణ పనులను ప్రారం భించారు. ఈ యేడాది జనవరి మాసంలో ప్రారంభమైన ఈ పనులు నత్తకే నడక నేర్పేలా సాగుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో ఈ క్యాలెండర్ ఏడాదిలోనైనా పనులు పూర్తి అవుతాయా అనే అను మానాలు వ్యక్తం అవుతున్నాయి. దీంతో నియోజకవర్గ కేంద్రమైన ఖానా పూర్ వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు నియోజకవర్గ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


ద్విచక్ర వాహనాన్ని వాగు దాటించేందుకు తంటాలు పడుతున్న యువకులు

18 రోజులుగా మరమ్మతులకు నోచుకోని తాత్కాలిక రోడ్లు

రెంకోని వాగుపై తర్లాపాడ్, దిలావర్‌పూర్ రెండు గ్రామాల సమీపంలో వంతెనలను నిర్మించేందుకు ప్రభుత్వం నిధులు మంజూరీ చేసింది. ఇందు కు గాను ఖానాపూర్ - తర్లాపాడ్ రోడ్డుపై వంతెన నిర్మాణం కోసం రూ, 4.70 కోట్ల నిధులు, ఖానాపూర్ - దిలావర్‌పూర్ రోడ్డుపై వంతెన నిర్మాణం కోసం రూ, 5.20 కోట్ల నిధులను ప్రభుత్వం మంజూరీ చేసింది. దీంతో ఈ రెండుచోట్ల ఉన్న లోలెవల్ వంతెనలను కూల్చేసి కొత్త వంతెనల నిర్మాణానికి ఈ ఏడాది జనవరిలో అధికారులు శ్రీకారం చుట్టారు. ఈ సమయంలోనే ఈ రోడ్డుమార్గంలో వాహనాలు వెళ్ళేందుకు వీలుగా ఒక్కో వంతెన వద్ద తాత్కాలిక రోడ్ల నిర్మాణాల కోసం ప్రభుత్వం నిధులు మంజూరీ చేసింది. ఇందుకు గాను ఒక్కో వంతెన వద్ద రూ, 2.5 లక్షల నిధులతో తాత్కాలిక రోడ్లను నిర్మాణం చేశారు. ఈ రెండుచోట్ల వేసిన తాత్కాలిక రోడ్లు మొదటి వర్షానికే దెబ్బ తిన్నాయి. ఆ తర్వాత తాత్కలిక రోడ్లకు మరమ్మతులు చేశారు. కాగా గత నెలలో భారీ వర్షాలు కురువడంతో రెంకోని వాగు ఉప్పొంగి ప్రవహించడంతో ఈ రెండు తాత్కాలిక రోడ్లు పూర్తి స్థాయిలో కొట్టుకు పోయాయి. ఈ రోడ్లు కొట్టుకుపోయి ఇప్పటి వరకు 18 రోజులు గడుస్తున్న ప్పటికీ ఇప్పటికి ఈ తాత్కాలిక రోడ్లు మరమ్మత్తులకు నోచుకోకపోవడంతో ఖానాపూర్, కడెం మండలాల ప్రజ లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తు న్నారు.

బిల్లుల చెల్లింపుల్లో జాప్యంతోనే నత్తనడకన పనులు

రెంకోనివాగుపై చేపట్టిన ఈ రెండు వంతెనల నిర్మాణ పనులు గత తొమ్మిది నెలల కాలంలో కేవలం 30 శాతం మాత్రమే జరిగినట్లు అధికారులు చెబుతున్నారు. జరిగిన ఈ పనులకు కూడా ఇప్పటి వరకు బిల్లుల చెల్లింపులు పూర్తిస్థాయిలో జరుగలేదని చెబుతున్నారు. తర్లాపాడ్ సమీపంలో నిర్మిస్తున్న వంతెన పిల్లర్ల పనులు మే నెల ఆరంభానికి ముందే పూర్తయ్యాయని అనుకుంటే ఈ వర్షాకాలం ఆరంభం కాకముందే వంతెనపై స్లాబులు పూర్తయ్యేవని అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోనే ఈ వంతెన నిర్మాణ పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా మారిందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ వంతెన నిర్మిస్తున్న కాంట్రాక్టరుకు సైతం ఇంకా రూ.35 లక్షల బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. దిలావర్ పూర్ వద్ద రూ.5.20 కోట్ల నిధులతో నిర్మాణం చేస్తున్న వంతెన పనులు సైతం ఇప్పటి వరకు కేవలం 30 శాతం మాత్ర మే పూర్తయినట్లు చెబుతున్న అధికారులు సదరు కాంట్రాక్టరుకు ఇప్పటి వరకు నయా పైసా కూడా బిల్లులను చెల్లించలేదని చెబుతున్నారు. సదరు వంతెన నిర్మాణం చేస్తున్న కాంట్రాక్టరుకు ఇప్పటికి రూ.1.30 కోట్ల పెండింగ్ బిల్లులను చెల్లించాల్సి ఉందని చెబుతున్నారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన బిల్లులు సకాలంలో అందక పోవడంతోనే సదరు కాంట్రాక్టర్లు పనులను నిలిపేసినట్లు ప్రచారం జరుగుతోంది. ఇక వంతెన వద్ద ప్రత్యామ్నాయంగా ఏర్పాటు చేసిన తాత్కాలిక రోడ్లకు ప్రభుత్వం నుంచి కేవలం ఒకేసారి మాత్రమే బిల్లులు చెల్లిస్తారని ఆ తర్వాత ఎన్నిసార్లు రోడ్డు దెబ్బతిన్న సదరు కాంట్రాక్టరే భరించాలనే నిబంధన నేపథ్యంలోనే ఈ రోడ్డు దెబ్బతిని 18 రోజులు గడుస్తున్నా ఇటు అధికారులు గాని అటు కాంట్రాక్టర్లు గాని ఈ తాత్కాలిక రోడ్ల మరమ్మతులను యుద్ధప్రాతిపాది కన చేపట్టలేకపోతున్నట్లు తెలుస్తోంది. అగ్రిమెంట్‌లోనే ఈ విషయాలన్ని ఉన్న నేపథ్యంలో ఇప్పటికైనా తా త్కాలిక రోడ్లకు మరమ్మత్తులు చేసి ఇటు ఖానాపూర్ - తర్లాపాడ్, ఖానాపూర్ - దిలావర్‌పూర్ రోడ్లపై వాహనాల రాకపోకలను ప్రారంభించాలని రెండు మండలాల ప్రజలు కోరుతున్నారు.

నాలుగు మండలాల ప్రజలకు తీవ్ర ఇబ్బందులు

ఈ రెండు రోడ్లు మరమ్మతులకు నోచుకోకపో వడంతో ఖానాపూర్, కడెం, పెంబి, దస్తూరాబాద్ నాలుగు మండలాల మధ్యపలు గ్రామాల ప్రజలపై ఆర్థికబారం పడుతోందని పలువురు ఆవే దన వ్యక్తం చేస్తున్నారు. కడెం మండలంలోని లింగాపూర్, సారంగాపూర్, ఎలగడప, మద్దిపడగతో పాటు మరో 20 గ్రామాల ప్రజలు ఖానాపూర్ వచ్చేందుకు ఒక్కొక్కరికి గతాని కన్నా అదనంగా రూ.100కు పైగా ఖర్చు అవుతుందని చెబుతున్నారు. కాగా ఖానాపూర్, పెంబి, దస్తూరాబాద్ సహా ఇతర ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికులు సైతం అదనంగా 8 కిలోమీటర్లు తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొనడంతో ఇబ్బంది పడుతున్నట్లు చెబుతున్నారు. దూరభారాన్ని తగ్గించుకునేందుకు కొంత మంది ద్విచక్ర వాహనదారులు రెంకోనివాగులోంచి దాటుతూ ప్రమాదాల బారిన పడుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. అధికారులు, పాలకులు ఇప్పటికైనా స్పందించి రెంకోని వాగుపై వంతెనల నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని కోరుతున్నారు. అప్పటి వరకు తాత్కాలిక రోడ్లకు మరమ్మత్తులు పూర్తి చేసి వాహనాల రాకపోకలను పునరుద్దరించాలని కోరుతున్నారు.

వంతెనల నిర్మాణం పూర్తికాకపోవడంతో ఇబ్బంది పడుతున్నాం

కమ్ములస్వామి, లింగాపూర్ గ్రామస్థుడు



రెంకోని వాగుపై రెండు చోట్ల నిర్మిస్తున్న వంతెనల నిర్మాణం త్వరగా పూర్తి చేయాలి. వంతెనల నిర్మాణంలో జాప్యం చేయడమే కాకుండా తాత్కాలిక రోడ్లను కూడా మరమ్మత్తులు చేయకపోవడంతో మా ప్రాంతం నుంచి ఖానాపూర్‌కు రాకపోకలు సాగించే వారికి అదనపుభారం పడుతోంది. ఇప్పటికైనా పాలకులు స్పందించకపోతే ఖానాపూర్, కడెం మండలాల ప్రజలంతా కలిసి ఆందోళన చేపడుతాం.

వీలైనంత త్వరగా వంతెనల నిర్మాణం పూర్తి చేస్తాం

అశోక్‌కుమార్, ఆర్ అండ్ బీ ఈఈ

తర్లాపాడ్, దిలావార్పూర్ వద్ద నిర్మిస్తున్న రెండు వంతెనల నిర్మాణం వర్షాకాలం కావడంతో నిలిపివేశాం. ప్రస్తుతం వర్షాలు తగ్గుముఖం పట్టినందున వీలైనంత త్వరగా వంతెనల నిర్మాణం పూర్తి చేస్తాం. కొట్టుకుపోయిన తాత్కాలిక రోడ్లకు మరమ్మతులు చేయాలని కాంట్రాక్టర్‌లకు సూచించాం. గురువారం నుంచి తాత్కాలిక రోడ్లకు మరమ్మతులు చేపడుతాం.

సీతారాముల కల్యాణ మండపం ప్రారంభం


సీతారాముల కల్యాణ మండపాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

నర్సాపూర్(జి), సెప్టెంబరు 19 : మండల కేంద్రంలోని రామాలయంలో సీతారాములకల్యాణ మండపం గురువారం స్వామి శివానంద భారతి ప్రారంభించారు. వరుసగా 7 రోజులుగా రామకోటి జపం చేస్తున్నామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. మండల కేంద్రానికి చెందిన రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగి గడ్డం గంగారాం తన సొంత నిధులతో శ్రీ సీతారాముల కల్యాణ మండపం నిర్మించారు. ఆలయానికి తనవంతు కృషి ఎల్లప్పుడు ఉంటుందన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

పీసీసీ అధ్యక్షుడిని కలిసిన మాజీ మంత్రి


పీసీసీ అధ్యక్షుడిని సన్మానిస్తున్న ఐకేరెడ్డి

నిర్మల్ కల్చరల్, సెప్టెంబరు 19 : మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి గురువారం నూతన పీసీసీ అధ్యక్షులు మహేష్‌గౌడ్‌ను హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో అనుచరులతో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. గజమాలతో సత్కరించారు. మాజీ ఎమ్మెల్యేలు విఠల్‌రెడ్డి, రేఖానాయక్, రాథోడ్ బాపురావు, పారిశ్రామికవేత్తలు మురళీధర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రిలో పచ్చదనం.. పరిశుభ్రత

సారంగాపూర్, సెప్టెంబరు 19 : మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పచ్చదనం.. పరిశుభ్రత కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ నేపథ్యంలో ఆరోగ్య కేంద్రం పరిసరాలలో ఉన్నటువంటి పిచ్చి మొక్కలతో పాటు చెత్తా చెదారాన్ని తొలగించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ వేదవ్యాస్, ఆరోగ్యకేంద్రం సూపర్‌వైజర్లు, ఆరోగ్య కార్యకర్తలు, పీహెచ్‌సీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

గర్భిణులు, బాలింతలకు

పోషక విలువలు గల ఆహారం అందించాలి : కలెక్టర్


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కలెక్టర్


సీమంతంలో పాల్గొన్న కలెక్టర్

నిర్మల్ కల్చరల్, సెప్టెంబరు 19 : జిల్లాలోని గర్భిణీలు, బాలింతలకు సంపూర్ణ పోషకాహారాన్ని అందించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదేశించారు. గురువారం టీఎన్జీవో భవనంలో నిర్వహించిన జాతీయపోషణ అభియాన్ కార్యక్రమంలో పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు. అదనపు కలెక్టర్ ఫైజాన్‌అహ్మద్ ఆమెతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... గర్భిణీ, బాలింతలకు పోషక విలు వలు గల సంపూర్ణ ఆహారంపై అవగాహన కల్పించాలన్నారు. ఈ నెల 30 వరకు నిర్వహించే పోషణ మాసంలో సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి పోషణ, పోషకాహారం, శుభ్రతపై తాగునీరు, పరిశుభ్రతపై వివరించాలన్నారు. జిల్లాలోని 926 అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ కార్యక్రమం అమలు చేయాలన్నారు.

అంగన్‌వాడీలు, ఆశా, వైద్య సిబ్బంది సమన్వయంతో వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. పిల్లల బరువు, ఎత్తు పెరిగే సంపూర్ణ ఆహారం అందించాలన్నారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... అంగన్‌వాడీ కేంద్రాల్లో కిచెన్ గార్డెన్లు ఏర్పాటు చేయాలని సూచించారు. తల్లి బిడ్డల సంక్షేమానికి కృషి చేయాలన్నారు. పోషణ అభియాన్‌పై ప్రతిజ్ఞ చేయించి గర్భి ణు లకు శ్రీమంతం నిర్వహించారు. సీడీపీవో నాగలక్ష్మి, వైద్యులు నయనారెడ్డి, సౌమ్య, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

సాగునీటి వసతి మెరుగుదలకు ప్రత్యేక చర్యలు

- ముథోల్ ఎమ్మెల్యే పవార్ రాంరావ్ పాటిల్


రెగ్యూలేటరీ గేట్ నుంచి నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే పవార్ రాంరావ్

భైంసా, సెప్టెంబరు 19 : నియోజక వర్గ పరిధిలో ప్రాజెక్టులు, చెరువులకు సంబంధించిన ఆయకట్టు భూములకు సాగునీటి వసతి మెరుగుదలకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రాంరావ్ పాటిల్ పేర్కొన్నారు. గురువారం గడ్డెన్నవాగు ప్రాజెక్టు రెగ్యులేటరీ గేటు నుంచి ప్రధాన కాలువ ద్వారా ఆయకట్టు భూములకు సాగు నీటిని విడుదల చేసిన సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. గడ్డెన్నవాగు ప్రాజెక్టు ప్రస్తుతం పూర్తి స్థాయి నీటి మట్టం 358.7 మీటర్లు, 1.852 టీఎంసీలతో నిండుకుండలా మారిందన్నారు. ఆయకట్టు భూములకు సాగునీటిని అందించేందుకు ప్రధాన కాలువ ద్వారా నీటిని విడుదల చేసామన్నారు. ప్రాజెక్టు ప్రధాన కాలువకు అవసరమైన పూర్తి స్థాయి మరమ్మత్తులు నిర్వహింపచేసేందుకు, లక్ష్యం మేర సాగునీటిని అందించేందుకు బాధ్యతాయుతంగా వ్యవహరిస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాంరావ్ పాటిల్ రెగ్యులేటర్ గేట్ వద్ద ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఇందులో గడ్డెన్నవాగు ప్రాజెక్టు డీఈ అనిల్‌కుమార్, ఏఈ శ్రీకాంత్, భైంసా మాజీ ఎంపీపీ అబ్దుల్ రజాక్, బీజేపీ పట్టణ కమిటీ అధ్యక్షుడు ఎనుపోతుల మల్లేశ్వర్, పార్టీ ప్రతినిధులు సోలంకే భీంరావ్, సాంప్లీ రమేష్, అల్లెం దిలీప్, రావుల పోశెట్టి , వడ్నప శ్రీనివాస్, గట్టు ప్రవీణ్, రాములతో పాటు పలువురు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

- జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్

మామడ, సెప్టెంబరు 19 : ప్రతి ఒక్కరూ పరిశుభ్రత అలవర్చుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ అన్నారు. గురువారం రోజున మండల కేంద్రంలో స్వచ్ఛతహీ సేవ కార్య క్రమంలో భాగంగా ఆయన పరిసరాలను పరిశీలించారు. ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయకుండా శుభ్రత పాటించాలని, మన ఆరోగ్యం మన చేతిలోనే ఉంటుందని పరిసరాలలో చెట్ల ను నాటడం వల్ల ఆరోగ్యానికి ఎంతో మేలు అన్నారు. గ్రామం అభివృద్ధి చెందాలంటే ప్రతి ఒక్కరూ సహకరించి ముందుకు నడవాలన్నారు. అనంతరం ప్రభుత్వ కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటారు. మొక్కలను నాటడమే కాకుండా వాటిని సంరక్షించే బాధ్యత అందరిపై ఉండాలన్నారు. ఇంటి పరిసరాల్లో వర్షపు నీటి నిల్వ ఉండకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో గంగాసాగర్ రెడ్డి, వైద్యాధికారి అరుణ్, ఏపీవో శివాజీ, ఏపీఎం అరుణ, టీఏ సురేష్, పంచాయతీ కార్యదర్శి, తదితరులు పాల్గొన్నారు.


1.మామడలో శుభ్రతపై అవగాహన కల్పిస్తున్న జిల్లా పంచాయతీ అధికారి
2. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న దృశ్యం

సంక్షిప్త సమాచారం

హెచ్ఐవీ ఎయిడ్స్‌పై అవగాహన


ఎయిడ్స్‌పై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

నిర్మల్ రూరల్, సెప్టెంబరు 19 : మండలంలోని ముజ్గి ఉన్నత పాఠశాలలో గురువారం జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో హెచ్ఐవీ ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హెచ్ఐవీ వ్యాప్తి నివారణ మార్గాలపై వివరించారు. అప్రమత్తంగా ఉంటేనే వ్యాధి దరి చేరదని ఐసీటీసీ, డీఎస్ఆర్‌సీ కౌన్సిలర్లు సుదర్శన్, శ్రీనివాస్‌లు అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నర్సారెడ్డి, నరేందర్‌రెడ్డి, రవిగౌడ్, దేవదాస్, ముత్యం, మంజుల, గులాబ్‌సింగ్, సంగీత, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ సిబ్బంది

సమస్యలు పరిష్కరించాలి


నిరసన తెలుపుతున్న ఆరోగ్యశ్రీ సిబ్బంది

నిర్మల్ కల్చరల్, సెప్టెంబరు 19 : ఆరోగ్యశ్రీ సిబ్బంది సమస్యలు పరిష్కారం చేయాలని ఆ సంఘం నాయకులు కోరారు. గురువారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. జిల్లా కార్యదర్శి సురేష్, స్వప్న, కల్పన, తదితరులు పాల్గొన్నారు.


పోలీసుల పనితీరు అభినందనీయం

నిర్మల్ కల్చరల్, సెప్టెంబరు 19 : వినాయక నిమజ్జనం సందర్భంగా నిర్మల్, భైంసా, ఖానాపూర్ పట్టణాల్లో పోలీసింగ్ సమర్థంగా నిర్వహించిన సిబ్బందిని ఎస్పీ జానకీ షర్మిల అభినందించారు. వారం రోజులుగా కంటి మీద కులుకు లేకుండా పని చేశారన్నారు. అన్ని శాఖల సమన్వయంతో నిమజ్జనం విజయవంతం కావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

రైతులకు విత్తనాల పంపిణీ


రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

ముథోల్, సెప్టెంబరు 19 : మండలంలోని ఎడ్‌బిడ్ తండాలో గురువారం రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రైతులకు ఉచిత బొబ్బెర (అలసంద) విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రైతులకు పలు సలహా, సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధులు రాజేష్, కాంగ్రెస్ మండల ఇన్‌చార్జి రావుల గంగారెడ్డి, మాజీ సర్పంచ్ ధూం నాయక్, రైతులు గణేష్, గజేందర్, అర్జున్, జీవన్, వినోద్, దుర్గాదాస్, తదితరులు ఉన్నారు.



























ఆదిలాబాద్‌లో దొంగతనం



బీరువాలోని దుస్తులను చిందరవందర చేసిన దొంగలు

ఆదిలాబాద్ రూరల్, సెప్టెంబరు 19: ఆదిలాబాద్ పట్టణంలోని భారీ చోరీ ఘటన వెలుగు చూసింది. పట్టణంలోని పంజేశా కాలనీలో నివాసం ఉండే బొంబడిపల్లి నరేష్ కుటుంబ సభ్యులతో కలిసి ఈనెల 14న హైదరాబాద్ వెళ్లారు. గురువారం తిరిగి వచ్చి చూడగా ఇంటి తాళం పగిలి ఉండడం గమనించారు. ఇంట్లోకి వెళ్లి చూడగా 12 తులాల బంగారం, అర కిలో వెండి నగలు, రూ.40వేల నగదు కనబడలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. వేలి ముద్రల నిపుణులు ఆధారాలు సేకరించారు. అక్కడున్న సీసీ ఫుటేజ్‌లను పోలీసులు పరిశీలిస్తున్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కృష్ణస్వరూప్

30న సచివాలయం ముట్టడి

ఆదిలాబాద్ అర్బన్, సెప్టెంబరు 19: ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ క్రిమిలియర్‌కు వ్యతిరేకంగా ఈ నెల 30న చలో సచివాలయం ముట్టడికి తరలిరావాలని ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జాతీయ చైర్మన్, దళిత బహుజన పార్టీ డీబీపీ జాతీయ అధ్యక్షుడు సుప్రీంకోర్టు న్యాయవాది వడ్లమూరి కృష్ణ స్వరూప్ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం చలో హైదరాబాద్ సచివాలయం ముట్టడి కార్యక్రమం కరపత్రాలను విడుదల చేశారు. ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ కోసం రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నాయకత్వంలో మంత్రుల కమిటీని ఏర్పాటు చేసి దళిత సమాజంలో చిచ్చు పెట్టారని విమర్శలు చేశారు. దళిత జాతుల ఓట్లతో గద్దెనెక్కిన రేవంత్‌రెడ్డి దళితుల గిరిజన బహుజనులను విచ్చినం చేసి వీరి భవిష్యత్తును దెబ్బతీశారని అన్నారు. ఇందులో రాష్ట్ర శాఖ అధ్యక్షుడు గవ్వల శ్రీకాంత్, జిల్లా అధ్యక్షుడు సూర్యవంశీ విద్యాసాగర్, సెడ్మకి భీమ్‌రావు, ఆర్ల రమేష్, భీమారావు, జునుగూరు లక్ష్మణ్, బి.జగన్‌సింగ్, జాదవ్ శ్యాంసుందర్, షేక్ షకీల్ తదితరులున్నారు.



కుంటాలలో స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

స్వచ్ఛతపై విద్యార్థులకు అవగాహన

కుంటాల, సెప్టెంబరు 19: మండల కేంద్రం కుంటాల గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో విద్యార్థులకు స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా తడి చెత్త, పొడి చెత్త, ప్రమాదకర చెత్తను వేరు చేయుట, ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేయించారు. ఎంపీడీవో లింబాద్రి, ఎంపీవో రహీం, ఏపీవో నవీన్, ఉపాధ్యాయులు ఉన్నారు.



కుంటాలలో పార్టీ నాయకులతో మాట్లాడుతున్న ఎంపీడీవో లింబాద్రి

ఓటరు జాబితాలో అభ్యంతరాలు ఉంటే తెలపండి

కుంటాల, సెప్టెంబరు, 19 : మండలంలోని ఆయా గ్రామ పంచాయతీల్లో ఓటరు జాబితా ముసాయిదాను ఇది వరకే ప్రదర్శించడం జరిగిందని ఏవైనా అభ్యంతరాలు ఉంటే తమ దృష్టికి తీసుకరావాలని ఎంపీడీవో లింబాద్రి పేర్కొన్నారు. గురువారం కుంటాల మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పలు రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 26వ తేది వరకు ఓటరు జాబితాలో ఎలాంటి అభ్యంతరాలు ఉన్న తమ సిబ్బందికి తెలియజేయాలన్నారు.

ముథోల్: మండల కేంద్రమైన ముథోల్‌లోని మండల అభివృద్ధి కార్యాలయంలో గురువారం డీఎల్పీవో సుదర్శన్ పాటిల్ బాణావత్, ఎంపీడీవో శివకుమార్‌లు ఓటరు జాబితాపై వివిధ పార్టీ నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. త్వరలో ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వివిధ పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించినట్లు డీఎల్పీవో తెలిపారు. అయితే ఓటర్ల ముసాయిదా జాబితాపై మాట్లాడారు. జాబితాలో ఏమైనా మార్పులు తప్పులు జరిగినట్లయితే చెప్పవలసిందిగా కోరారు. మండలంలో 19 గ్రామ పంచాయతీలకు గాను 166 వార్డులు, 28,046 ఓటర్లు ఉన్నారని తెలిపారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ మండల ఇన్‌చార్జి బండారి గంగాధర్, కాంగ్రెస్ పార్టీ మండల ఇన్‌చార్జి రావుల గంగారెడ్డి, బీజేపీ నాయకులు ఎస్. పోతన్న, డి. శ్రీనివాస్, బీఎస్పీ మండల నాయకులు ఎస్. సునీల్ కుమార్, సీపీఎం వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు గంధం లింగన్న, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మణచాంద: మండలంలోని అన్ని పార్టీల నాయకులతో ఎంపీడీవో రాధా రాథోడ్ గురువారం సమావేశం నిర్వహించారు. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించనున్న దృష్ట్యా ఆయా గ్రామ పంచాయతీలలో వార్డుల వారీగా ఉన్న అభ్యంతరాలను తెలపాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఒడ్నాల రాజేశ్వర్, బీజేపీ మండల అధ్యక్షుడు గోవర్ధన్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కొరిపెల్లి కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



ఓటరు జాబితాపై పార్టీ నాయకులతో మాట్లాడుతున్న డీఎల్పీవో, ఎంపీడీవో



సమావేశంలోమాట్లాడుతున్న మేనేజర్

స్వయం సహాయక సంఘాలకు
కోటి రూ.14లక్షలు పంపిణీ చేస్తాం

బోథ్, సెప్టెంబరు19: మండలంలోని 13 స్వయం సహాయక సంఘాలకు ఒక కోటి 14 లక్షలు పంపిణీ చేయనున్నట్లు బోథ్ తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ నాగ ఫణీంద్ర పేర్కొన్నారు. స్వయం సహాయక సంఘల వారు ఐకేపీ ఉద్యోగులతో కలిసి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రుణాలు తీసుకున్న వారు తిరిగి చెల్లించినట్లయితే రుణాలను తిరిగి ఇస్తామన్నారు. ప్రతినెల సమావేశాల నిర్వహించుకుని పుస్తక నిర్వహణ సరిగ్గా ఉండే విధంగా చూసుకోవాలన్నారు. స్వయం సహాయక సంఘాల వారు వ్యాపారాలు నిర్వహించుకుంటే వారికి రుణాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. సమావేశంలో ఏపీఎం మాధవ్, సీసీలు సంజీవ, సుభద్ర, గంగాధర్, లక్ష్మణ్, విజయలక్ష్మి, వీవోఏలు స్వామి, సాయిలు, గంగామణి, లక్ష్మీ, సంగీత, నిరంజన, లక్ష్మీ, మనోహర్, కాశీనాథ్, రంజిత్, సోనేరావు, బ్యాంకు మిత్ర జ్యోతి, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలో పౌరసరఫరా అధికారుల దాడులు

ఆదిలాబాద్‌రూరల్, సెప్టెంబర్ 19: ఆదిలాబాద్ పట్టణంలో పౌర సరఫరాల అధికారులు హోటళ్లు, టిఫిన్ సెంటర్లపై దాడులు నిర్వహించారు. ఆయా కేంద్రాల్లో వాణిజ్య సిలెండర్లకు బదులు గృహ వినియోగ సిలెండర్లు వాడుతూ ప్రభుత్వ రాయితీ పక్కదారి పడుతున్న వైనంపై కలెక్టర్ రాజర్షి షా సీరియస్ అయ్యారు. ఆయన ఆదేశాల మేరకు పట్టణంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు బాబుసింగ్, ప్రేమ్‌నివాస్, రామారావ్, నారాయణ, మధుసూదన్, విశ్వనాథ్, రవీందర్ ఆయా దుకాణాలు తనిఖీ చేశారు. దాదాపు 20కి పైగా సిలెండర్లు స్వాధీనం చేసుకున్నారు. రెండోసారి రాయితీ సిలెండర్లు వినియోగిస్తే కేసునమోదు చేస్తామని పౌరసరఫరాల అధికారి వాజిద్‌అలీ పేర్కొన్నారు.

వినాయకుల నిమజ్జనానికి బందోబస్తు ఏర్పాటు

బోథ్, సెప్టెంబరు 19: మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని ఏర్పాటుచేయడంతో స్థానిక సీఐ రమేష్, ఎస్సై ప్రవీణ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీసులతో బందోబస్తును ఏర్పాటు చేశారు. అంతకుముందు వినాయక నిమజ్జనం జరిగే ప్రాంతాలను పరిశీలించారు. గ్రామ పంచాయతీ గణేష్ విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు ప్రత్యేకంగా క్రేన్‌లను తెప్పించడం జరిగింది. నిమజ్జనం సందర్భంగా పెద్దవాగు క్రేన్ సిద్ధంగా ఉంటుందని గ్రామ పంచాయితీ ఈవో అంజయ్య, మండపాల వారికి వివరించారు. పోలీసు అధికారులు సైతం ముందు చూపుగా వివిధ మండపాల వారితో ప్రశాంతవాతావరణంలో నిమజ్జనం జరపాలని సూచించారు. మరోవైపు అల్లర్లు జరుగకుండా కొంతమందిని బైండోవర్ చేసినట్లు చేశారు.

స్వచ్ఛత హీ సేవాను పకడ్బందీగా నిర్వహించాలి

ఇంద్రవెల్లి, సెప్టెంబరు19: స్వచ్ఛతహీ సేవా కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీవో బాస్కర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని స్థానిక మేజర్ గ్రామ పంచాయితీ ఆవరణలో ఐకేపీ సిబ్బంది, మహిళా సమాఖ్య సంఘాలతో స్వచ్ఛతహీ సేవా కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం రాథోడ్ రామారావు, పంచాయితీ ఈవో సంజీవ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి

ఆదిలాబాద్‌రూరల్, సెప్టెంబరు19: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు బోధన పరంగా మరింత మెరుగు పరిచేలా రూం టూ రీడ్ స్వచ్ఛంద సంస్థ పలు కార్యక్రమాలు నిర్వహిస్తుందని డీఈఓ ప్రణీత తెలిపారు. గురువారం ఆదిలాబాద్‌లోని డైట్ కళాశాలలో రూం టూ రీడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో కాంప్లెక్స్ హెచ్ఎం తదితరులకు శిక్షణ ఏర్పాటు చేశారు. రూం టూ రీడ్ సంస్థ ఇచ్చే పుస్తకాల వల్ల విద్యార్థుల్లో పఠనాసక్తి పెరుగుతుందన్నారు. విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించాలన్నారు.

కేంద్ర మంత్రి తల నరికి తెచ్చిన వారికి నా ఆస్తి రాసిస్తా

- కేంద్రంలో గాడ్సే ప్రభుత్వం కులమతాలను రెచ్చగొడుతుంది
- ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జుపటేల్ సంచలన వ్యాఖ్యలు



కేంద్రమంత్రి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఎమ్మెల్యే బొజ్జుపటేల్, నాయకులు

ఉట్నూర్, సెప్టెంబరు 19: కేంద్ర మంత్రి రవ్నీత్‌సింగ్‌బిట్టు తలను నరికి తీసుకువచ్చిన వారికి తన తండ్రి సంపాదించిన ఎకరం 38గుంటల వ్యవసాయ భూమి రాసి ఇస్తానని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జుపటేల్ సంచలన వ్యాఖ్యలు చేశారు. గురువారం టీపీసీసీ రాష్ట్ర అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ పిలుపు మేరకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఉట్నూర్ మండల కేంద్రంలో కేంద్ర మంత్రి రవ్నిత్‌సింగ్ బిట్టు దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో గాడ్సే ప్రభుత్వం ఉందని, కుల, మతాల మధ్య చిచ్చుపెట్టి దేశంలో హింస సృష్టించడానికి బీజేపీ ప్రయత్నిస్తోందని అన్నారు. కాంగ్రెస్‌పార్టీ అగ్ర నేత, ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ తలతెచ్చిన వారికి రివార్డు ఇస్తామని అని కేంద్రమంత్రి రవ్నీత్‌సింగ్‌బిట్టు చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ ఖానాపూర్ ఎమ్మెల్యే కౌంటర్ ఇచ్చారు. కేంద్రమంత్రి బిట్టు చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. బీజేపీ పార్టీ గుండాలను పోషిస్తుందని అన్నారు. కేంద్రహోంశాఖ మంత్రి అమిత్‌షా ఇప్పటివరకు స్పందించక పోవడం దేనికి సంకేతమని ప్రశ్నించారు. బీజేపీ రవ్నిత్‌బిట్టుపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ కాంగ్రెస్ ప్రభుత్వంపై బురద జల్లుతుందని, పదేళ్ల అధికారంలో ఉండి రాష్ట్రానికి ఏం చేశారో చెప్పాలని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడికౌశిక్‌రెడ్డి నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని సూచించారు. ట్విట్టర్ పిట్ట కేటీఆర్ విదేశాల్లో ఉంటూ ప్రభుత్వంను బద్నామ్ చేయడం సరికాదని అన్నారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జీ ఆత్రం సుగుణ, కాంగ్రెస్ కిసాన్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డి, పీఏసీఎస్ ఛైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, మండల అధ్యక్షులు అబ్దుల్ ఖయ్యూం, ఇంద్రవెల్లి మండల అధ్యక్షులు ముఖాడే ఉత్తం, బ్లాక్ అధ్యక్షులు ఇక్బాల్, ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి దూట రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

కలెక్టరేట్ ఎదుట రైతుల ధర్నా

ఆదిలాబాద్‌రూరల్, సెప్టెంబరు19: మార్కెట్ ధరకు అనుగుణంగా పరిహారం ఇస్తేనే తమ భూములను రేణుక సిమెంట్ ఫ్యాక్టరీకు ఇస్తామని ఆదిలాబాద్ రూరల్ మండలంలోని యాపల్‌గూడ రైతులు స్పష్టంచేశారు. ఫ్యాక్టరీకి భూములు ఇవ్వాలని అధికారులు బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. అధికారుల తీరును నిరసిస్తూ గురువారం ఆదిలాబాద్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అధికారులు గ్రామసభ నిర్వహించి తమ అభిప్రాయాలను సేకరించాలని వారు డిమాండ్ చేశారు.

మొక్కలను నాటి సంరక్షించాలి

ఇంద్రవెల్లి, సెప్టెంబరు19: నాటిన ప్రతీమొక్కను సంరక్షించాలని జడ్పీ సీఈవో జితేందర్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని ఏమైయికుంట గ్రామాన్ని సందర్శించి వన మహోత్సవం సందర్భంగా మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వన మహోత్సవంలో భాగంగా నాటిన ప్రతి మొక్కను కాపాడాల్సిన బాధ్యత ప్రజలందరిపై ఉందని, మొక్కలను సంరక్షించేందుకు తగినచర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో భాస్కర్, మాజీ సర్పంచ్ జాదవ్ లఖన్, ఏపీవో జాదవ్ శ్రీనివాస్, టీఏలు జైస్వాల్, సంతోష్‌లాల్, తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

ఉట్నూర్, సెప్టెంబరు19: మండలంలోని పులిమడుగు గ్రామ శివారులో ఉన్న పంటపొలాల్లో అనుమానాస్పద స్థితిలో ఒకరుమృతి చెందినట్లు ఎస్సై మనోహర్ తెలిపారు. మండలంలోని సాలెవాడకే పంచాయతీ పరిధిలో ఉన్న సోముగూడకు చెందిన కోరింగ రాము (52)గా గుర్తించామన్నారు. మృతదేహం పొదల మధ్య గాయాలతో ఉండడంపై పలు అనుమానాలు వ్యక్తం చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఉట్నూర్‌ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

మధ్యాహ్న భోజన పథకానికి
నాసిరకం బియ్యం సరఫరా

- ఫిర్యాదుతో పరిశీలించిన జిల్లా అధికారి



బియ్యంను పరిశీలిస్తున్న సివిల్ సప్లై అధికారి

బోథ్, సెప్టెంబరు 19: మండలంలోని కౌటా(కె) గ్రామం ప్రాథమిక పాఠశాలకు ప్రభుత్వ పరంగా సరఫరా అయిన బియ్యం నాసిరకంగా ముక్కిపోయి ఉండటంతో గ్రామ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం జిల్లా ఉన్నతాధికారులకు ఈ విషయమై ఫిర్యాదు చేసింది. దీంతో స్పందించిన డీఎస్‌వో వహిత్‌అలీ గురువారం గ్రామంలోని పాఠశాలకు చేరుకుని బియ్యాన్ని పరిశీలించారు. నాణ్యత లేకుంటే విద్యార్థులకు వండి పెట్టొద్దని, తిరిగి సివిల్‌సప్లై బోథ్ గోడౌన్‌కు పంపించాలని సూచించారు. అనంతరం పాఠశాలలో మరుగుదొడ్లను పరిశీలించారు. మంచినీటి సౌకర్యం, పారిశుధ్యం లోపం ఉన్నట్లయితే తమ దృష్టికి తీసుకురావాలని ఆయన సూచించారు. డీఎస్‌వో వెంట డీటీ ఎన్‌ఫోర్స్‌మెంట్ జాదవ్, రామారావు పాఠశాల ప్రధానోపాధ్యాయులు పుష్ప, ఉపాధ్యాయులు శ్రీనివాసులు ఉన్నారు.

హోటళ్లపై అధికారుల దాడులు

ఆదిలాబాద్ అర్బన్, సెప్టెంబరు 19: డోమెస్టిక్‌గ్యాస్ సిలిండర్లను కమర్షియల్‌గా వినియోగిస్తున్నారన్న ఫిర్యాదుల మేరకు పౌరసరఫరాలశాఖ అధికారులు దాడులు నిర్వహించారు. గురువారం పట్టణంలోని పలుహోటళ్లలో తనిఖీ చేయగా కమర్షియల్ గ్యాస్ కాకుండా ఇంట్లో వినియోగించే గ్యాస్‌ను వినియోగిస్తున్నట్లు గుర్తించారు. వాటిని స్వాధీనం చేసుకుంటూ యజమానులకు హెచ్చరికలు జారీచేశారు. కమర్షియల్ కాకుండా డోమెస్టిక్ సిలిండర్లను వాడితేచర్యలు తప్పవని డీఎస్ఓ జావిద్‌అలీ హెచ్చరించారు. ఇళ్ల కోసం వినియోగించే గ్యాస్ సిలిండర్లను హోటళ్ల వారు వినియోగిస్తున్నారని ఫిర్యాదులు రావడంతో తనిఖీ చేశామని ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ బాబుసింగ్ తెలిపారు. పలు హోటళ్లలో తనిఖీచేసి 22కు పైగా పట్టుకున్నట్లు తెలిపారు. వారం రోజుల్లో యజమానులకు నోటీసులు అందించి వివరణ తీసుకుని చర్యలు తీసుకుంటామన్నారు. ఇందులోఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీలు బాబాసింగ్, నారాయణ, ప్రేమ్‌నివాస్, మధుసూదన్, రామారావ్, విశ్వనాథ్, యూడీఆర్‌ఐ రవీందర్ తదితరులున్నారు.



గవర్నర్‌ను కలిసి మెమోరాండం సమర్పిస్తున్న రితేష్ రాథోడ్

జైనూర్ ఘటన కేసు ఫాస్ట్‌ట్రాక్ కోర్టుకు బదిలీ చేయాలని
గవర్నర్‌ను కలిసిన బీజేపీ ఎస్టీ మోర్చా

ఉట్నూర్, సెప్టెంబరు 19: జైనూర్ ఘటనపై ప్రభుత్వం తరఫున పురోగతి లేకపోవడంతో కేసును ఫాస్ట్‌ట్రాక్ కోర్టుకు బదిలీ చేసి బాధిత మహిళ కుటుంబానికి న్యాయం చేయాలని బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కళ్యాణ్‌నాయక్ ఆధ్వర్యంలో రాష్ట్రగవర్నర్ జిష్ణుదేవ్‌వర్మను గురువారం కలిశామని బీజేపీ రాష్ట్ర నాయకులు రాథోడ్‌రితేష్ తెలిపారు. గవర్నర్‌ను కలిసిన అనంతరం ఆయన హైదరాబాద్ నుంచి గవర్నర్‌కు సమర్పించిన వినతిపత్రాన్ని పంపించారు. ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజన మహిళలపై అత్యాచారాలు చేయడంతోపాటు అక్రమ సంబంధాలు పెట్టుకుంటు ఓ వర్గంవారు ఏజెన్సీలోని గిరిజన మహిళలను వంచిస్తున్నారని కొమురంభీం జిల్లాలోని జైనూర్‌లో 500 కుటుంబాలు ఒక వర్గం వారు చేరి అక్రమంగా వ్యవసాయం చేస్తూ వ్యాపారాలు చేస్తూ తిష్టవేశారన్నారు. గత 20 ఏళ్లుగా 64మంది గిరిజన మహిళలను లవ్ జిహాది పేరుతో పెళ్లిళ్లు చేసుకున్నారని గవర్నర్‌కు వివరించారు. ప్రభుత్వం ద్వారా విచారణ జరిపి మోసపోయిన గిరిజన కుటుంబాలకు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని కోరినట్లు తెలిపారు. కొందరుబీజేపీని అప్రతిష్టపాలు చేయడానికి సామాజిక మాధ్యమాల ద్వారా తప్పుడు ప్రకటనలు చేస్తున్నారని ప్రజలు ఇలాంటి ప్రకటనలు విశ్వసించవద్దని రాథోడ్‌రితేస్ కోరారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

తలమడుగు, సెప్టెంబరు19: మండలంలోని ఖఫర్ దేవి ఎక్స్ రోడ్డు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్సై అంజయ్య తెలిపారు. మండలంలోని మందగూడ గ్రామానికి చెందిన మేస్త్రం మహేందర్ బైకుపై తలమడుగు నుంచి మందగూడ వెళ్తుండగా రోడ్డుపనులు చేపడుతున్న టిప్పర్ వెనుక నుంచి వచ్చి మహేందర్ వాహనంపై రావడంతో టిప్పర్ టైర్ కింద పడి అక్కడికక్కడే మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు. ఘటన స్థలాన్ని ఆదిలాబాద్ రూరల్ సీఐ ఫణీంధర్ పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. మృత్యు కుటుంబ సభ్యులను మాజీ జడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి, తుడుం దెబ్బ నాయకులు పరామర్శించారు.

విద్యార్థులు రోజూ యూనిఫామ్ ధరించాలి

ఉట్నూర్, సెప్టెంబరు19: ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులు ప్రతిఒక్కరు ప్రతీరోజు యూనిఫామ్‌లు ధరించాలని జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహణాధికారి జితేందర్‌రెడ్డి అన్నారు.గురువారం మండలంలోని మత్తడి గూడలోని మండల పరిషత్ పాఠశాలను సందర్శించారు. విద్యార్థులకు యూనిఫామ్‌లు లేక పోవడంతో ప్రభుత్వం పంపిణీ చేస్తున్న డ్రెస్సులను వేయించాలని ఉపాధ్యాయులకు సూచించారు. వంటకాల గురించ విద్యార్థులను అడిగి తెలుసుకుని నాణ్యమైన భోజనం అందించాలన్నారు. గుడ్నూరు మండల కేంద్రంలోని ఆసుపత్రి ఆవరణలో సీఈఓ జితేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో తొలగించారు. కార్యక్రమంలో డాక్టర్ మహేందర్, ఈజీఎస్ఏపీఓ రజనికాం త్, పంచాయతీ ఈఓ ఉప్పరి శంకర్‌లున్నారు.

తహసీల్దార్లకు పోస్టింగ్

ఆదిలాబాద్‌రూరల్, సెప్టెంబరు19: ఉద్యోగోన్నతిపై వచ్చిన నలుగురికి పోస్టింగ్, జిల్లాలో పని చేస్తున్న మరో ముగ్గురికి తహసీల్దార్లకు స్థానచలనం కల్పిస్తూ కలెక్టర్ రాజర్షి షా ఉత్తర్వులు జారీ చేశారు. భీంపూర్- నలంద ప్రియ, ఇచ్చోడ- సత్యనారాయణ, ఆదిలాబాద్ రూరల్- గోవింద్, బేల- రఘునాథ్, సిరికొండ- తుకారం తహసీల్దార్లుగా నియమించిన కలెక్టర్, పంచపుల, శైలజలకు కలెక్టరేట్ సూపరిండెంట్లుగా పోస్టింగ్ ఇచ్చారు. వెంటనే కొత్త పోస్టింగ్ చోట విధుల్లో చేరాలని ఆదేశించారు.

అక్షరాస్యత వంద శాతం సాధించాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

నిర్మల్ కల్చరల్, సెప్టెంబరు 19 : జిల్లాలో అక్షరాస్యత వందశాతం సాధించేలా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అధికారులను ఆదేశించారు. గురువారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ... రాష్ట్రంలో జిల్లా అక్షరాస్యత 27 స్థానంలో ఉందన్నారు. మండలాల వారీగా 13,563 మంది నిరక్షరాస్యులను గుర్తించినట్లు చెప్పారు. సామాజిక, ఆర్థిక అక్షరాస్యత, ఆరోగ్య రక్షణ, పర్యావరణ, పరిశుభ్రత, కుటుంబ సంక్షేమ తదితర అంశాలపై అవగాహన కల్పించాలని సూచించారు. జడ్పీ సీఈవో గోవింద్, డీఈవో రవీందర్‌రెడ్డి, వైద్యాధికారి రాజేందర్, డీపీవో శ్రీనివాస్, కమిషనర్ రాజు, మెప్మా పీడీ సుభాష్, తదితరులు పాల్గొన్నారు.

వరిలో బ్యాక్టీరియా ఎండాకు తెగులు


- క్షేత్రస్థాయిలో పంటను పరిశీలించిన శాస్త్రవేత్తలు



వరి పంటలను పరిశీలిస్తున్న ముథోల్ ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు

ముథోల్, సెప్టెంబరు 19 : మండలంలోని ఆయా గ్రామాల్లో గల వరి పంటను గురువారం ముథోల్ ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు క్షేత్రస్థాయిలో వరి పంటలను పరిశీలించారు. ప్రధాన శాస్త్రవేత్త డా. నర్సయ్య ఆధ్వర్యంలో శాస్త్రవేత్తలు ఈ పంటలను పరిశీలించినట్లు తెలిపారు. అయితే వరి పంటలో బ్యాక్టీరియా ఎండాకు తెగులు సోకినట్లు గుర్తించారు. ఆకుల పైన పసుపు రంగు మచ్చలు ఏర్పడి వీటి చుట్టూ డాగు మచ్చగా ఏర్పడి క్రమేపి అంచుల వెంబడి అలల మాదిరిగా పైనుండి క్రమేపి మట్టల వరకు వ్యాపిస్తాయని తెలిపారు. వీటి నివారణకు కాపర్ హైడ్రాక్సైడ్ 400ల గ్రాములు అలాగే ట్రైపోమైసిన్ సల్ఫేట్ 60 గ్రాములు కలిపి ఎకరానికి పిచికారీ చేయాలని సూచించారు. ఈయన వెంట శాస్త్రవేత్తలు డా. విజయ్ కుమార్, డా. కార్తీక్‌లు ఉన్నారు.

మహిళా సాధికారత ఆధ్వర్యంలో అవగాహన



ముథోల్, సెప్టెంబరు 19 : జిల్లా మహిళా సాదికారత కేంద్రం ఆధ్వర్యంలో గురువారం ముథోల్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలికల)లో 'బేటి బచావో బేటి పడావో' గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జ్యోతి, మౌనికలు తగు ఉదాహరణలతో విద్యార్థినులు జాగ్రత్తతో ఉండాలని వివరించారు. సమాజంలో జరుగుతున్న లింగ వివక్షతను, బాల్య వివాహాలు, సైబర్ క్రైమ్, చైల్డ్ లైన్ సర్వీసెస్, బాలికల విద్య, మున్నగు వాటి గురించి ఉదాహరణలతో వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు గీతా, ఉపాధ్యాయులు స్వర్ణలత, అంజుమ్ పర్వీన్, నీరజ, కవిత యాదవ్, కొక్కుల గంగాధర్, విద్యార్థినులు, తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితాపై
అభ్యంతరాలు 21వ తేదీ లోపు తెలియజేయండి

- రాజకీయ పార్టీల నాయకుల సమావేశంలో మండల ప్రత్యేక అధికారి జీవరత్నం
- గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఓటరు జాబితా విడుదల

ఖానాపూర్, సెప్టెంబరు 19 : రానున్న గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో విడుదల చేసిన ఓటరు జాబితాలో అభ్యంతరాలు ఉంటే ఈ నెల 21వ తేదీలోపు తెలియజేయాలని మండల ప్రత్యేక అధికారి జీవరత్నం తెలిపారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో గురువారం అన్ని రాజకీయ పార్టీల మండల అధ్యక్ష, కార్యదర్శులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ఓటరు జాబితాను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఓటరు జాబితాను ప్రతి గ్రామ పంచాయతీ కార్యాలయంలో బోర్డుపై అతికించనున్నట్లు పేర్కొన్నారు. ఒకే కుటుంబానికి సంబంధించిన సభ్యుల ఓట్లు వేరువేరుగా వార్డులలో తప్పుగా నమోదైతే ఒక తెల్ల కాగితంపై దరఖాస్తు రాసి సంబంధిత గ్రామ పంచాయతీ కార్యదర్శి అందజేయాలని సూచించారు. సూచించిన తేదీలోపు తప్పొప్పులను తెలిపితే వాటిని సరి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో చిక్యాల రత్నాకర్ రావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దొనికెని దయానంద్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు తాళ్లపల్లి రాజగంగన్న, సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి నంది రామయ్య, టీజేఎస్ జిల్లా అధ్యక్షులు తిలక్‌రావు, బీజేపీ మండల అధ్యక్షుడు టేకు ప్రకాష్ సహా పలు పార్టీల నాయకులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు, డీఏలు వెంటనే విడుదల చేయాలి

- డీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. లింగారెడ్డి



ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. లింగారెడ్డి

నిర్మల్, సెప్టెంబరు 19 : దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయ, ఉద్యోగుల పెండింగ్ బిల్లులు, బకాయి ఉన్న నాలుగు డీఏలు వెంటనే విడుదల చేయాలని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. లింగారెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం నిర్మల్ పట్టణంలోని ప్రభుత్వ ఆశ్రమ పాఠశాల ద్యాంగాపూర్, బాలికల ఆశ్రమ పాఠశాల, కస్బా హైస్కూల్, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, మంజులాపూర్ హైస్కూల్, ఇతర పాఠశాలలను సందర్శించిన లింగారెడ్డి ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడారు. గత ప్రభుత్వ కాలం నుండి పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయ ఉద్యోగులకు సంబంధించిన అనేక ఆర్థిక బిల్లులు నేటికీ పెండింగ్‌లో ఉన్నాయని, తద్వారా ఉద్యోగులు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారన్నారు. అదే విధంగా గతంలో ఎన్నడూ లేని విధంగా నాలుగు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని వాటిని వెంటనే విడుదల చేయాలన్నారు. గత రెండు దశాబ్దాలుగా పాఠశాల విద్యారంగంలో పర్యవేక్షణ అధికారుల పోస్టులు వందలాదిగా ఖాళీగా ఉన్నాయని, ఏకీకృత సర్వీస్ రూల్స్ సమస్యను పరిష్కరించి సత్వరమే వాటిని భర్తీ చేయాలన్నారు. విద్యారంగానికి బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయించి అన్ని పాఠశాలలను అభివృద్ధి చేయాల్సిందిపోయి గత ప్రభుత్వం లాగే ఈ ప్రభుత్వం కూడా కొద్ది మందికి మేలు చేసే ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు ఏర్పాటు చేయడం సరికాదన్నారు. పీఆర్సీ గడువు ముగిసి 15 నెలలు కావస్తున్నా ఇప్పటి వరకు పీఆర్సీ కమిషన్ నుండి రిపోర్ట్ స్వీకరించడం లేదని, వెంటనే పీఆర్సీ రిపోర్ట్ తెప్పించుకుని 01.07.2023 నుండి వర్తించే విధంగా అమలు చేయాలన్నారు. రాష్ట్రంలో అనేక పాఠశాలల్లో ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని కావున వెంటనే నూతన ఉపాధ్యాయులకు పోస్టింగ్ ఆర్డర్లు ఇవ్వాలన్నారు. వీటితో పాటు అనేక ఉపాధ్యాయ, ఉద్యోగ సమస్యలు పెండింగ్‌లో ఉన్నందున వాటి పరిష్కారం కోసం ఈ నెల 24 హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ ఉపాధ్యాయ, ఉద్యోగ, పెన్షనర్ల జేఏసీ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందని, ఆ సమావేశంలో చర్చించి భవిష్యత్ ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. సమావేశాల్లో డీటీఎఫ్ నిర్మల్ జిల్లా అధ్యక్షులు ఎస్. మహేంద్రాచారి, ప్రధాన కార్యదర్శి చంద్రనాగకాంత్, కార్యదర్శి ఆర్. రమేష్, పాల్గొన్నారు.

ఘనంగా మాజీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ అయిండ్ల భీంరెడ్డి వర్ధంతి



మునిపెల్లిలో వర్ధంతిలో పాల్గొన్న భూపాల్‌రెడ్డి, ఇతర నాయకులు, కార్యకర్తలు

లక్ష్మణచాంద, సెప్టెంబరు 19 : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్‌గా, మంత్రిగా సేవ చేసిన స్వర్గీయ అయిండ్ల భీంరెడ్డి వర్ధంతిని ఆయన స్వగ్రామం అయిన మునిపెల్లిలోను, మల్లాపూర్ గ్రామంలోను గురువారం ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ... భీంరెడ్డి లక్ష్మణచాంద మండలం ఏర్పాటు విషయంలో కీలక పాత్ర వహించాడని, నిర్మల్ నియోజకవర్గంలోని చాలా గ్రామాల్లో ఇళ్ల స్థలాలు ఇప్పించటంతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించాడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో భీంరెడ్డి తనయులు, బీజేపీ నాయకులు అయిండ్ల భూపాల్ రెడ్డి, నాయకులు దుర్కి డేవిడ్, కమల్‌కోట వెంకట్ రెడ్డి, రమేష్, మధు, రాజు, దామోదర్, భీంరెడ్డి, లక్ష్మణ్, బొడ్డు భాయ్, బాలు, నర్సారెడ్డి, లింగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వినాయక నిమజ్జనం



కుంటాలలో వినాయకుని వద్ద పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే రామారావు పటేల్

కుంటాల, సెప్టెంబరు , 19 : కుంటాల మండలంలో గురువారం వినాయక నిమజ్జనోత్సవాలు ఘనంగా నిర్వహించారు. గత 13 రోజుల నుంచి ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ, రాత్రి వేళల్లో భజనలు, కోలాటలు, ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి గురువారం బ్యాండు మేళాల మధ్య యువకుల నృత్యాలతో సమీప చెరువులకు తరలించి నిమజ్జనం జరిపారు. మండల కేంద్రం కుంటాలలో వినాయక నిమజ్జన ఉత్సవాలకు ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ హాజరయ్యారు. వినాయకునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎస్సై భాస్కరాచారి ఆధ్వర్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు.

గణనాథుడికి నిర్మల్ మున్సిపల్ చైర్మన్ ప్రత్యేకపూజలు

నిర్మల్ కల్చరల్, సెప్టెంబరు 19 : నిర్మల్ పురపాలక సంఘం నెలకొల్పిన వినాయక విగ్రహం వద్ద గురువారం చైర్మన్ ఈశ్వర్ పూజలు చేశారు. నిమజ్జనం సందర్భంగా సహకరించిన అధికారులు, ఉత్సవ కమిటీలు ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. మున్సిపాలిటీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. నిమజ్జనం కార్యక్రమం నిర్వహించారు.

జిల్లా ఎస్పీకి ఘన సన్మానం



ఎస్పీని సన్మానిస్తున్న ముథోల్ ఉత్సవ కమిటీ సభ్యులు

ముథోల్, సెప్టెంబరు 19 : ముథోల్ హిందూ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గురువారం నిర్మల్ జిల్లా ఎస్పీ జానకి షర్మిలకు ఎస్పీ కార్యాలయంలో కలిసి ఘనంగా సన్మానించారు. ముథోల్ గణేష్ నిమజ్జనంకు గట్టి బందోబస్తు ఏర్పాటు చేసి, ప్రశాంతంగా నిర్వహించినందుకు ఉత్సవ కమిటీ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు. అలాగే భైంసా ఏఎస్పీ అవినాష్‌కుమార్, భైంసా టౌన్ సీఐ రాజారెడ్డిని ఘనంగా సన్మానించారు. బందోబస్తులో పాలు పంచుకున్న పోలీసులకు ఈ సందర్భంగా వారు ధన్యవాదాలు తెలిపారు. గణేష్ నిమజ్జన ఉత్సవాల సందర్భంగా పోలీసులకు సహకరించిన ఉత్సవ కమిటీ అధ్యక్షుడు రోళ్ల రమేష్, సభ్యులను, గణేష్ మండలి నిర్వాహకులను ఎస్పీ, అడిషనల్ ఎస్పీలు అభినందించారు. ఈ కార్యక్రమంలో ముథోల్ హిందూ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు రోళ్ల రమేష్, గౌరవ అధ్యక్షుడు ధర్మపురి సుదర్శన్, వీడీసీ అధ్యక్షులు గుంజల నారాయణ, కోశాధికారి మైత్రి సాయినాథ్, ఉపాధ్యక్షులు వరగంటి జీవన్, తాటివార్ రమేష్, కోరి పోతన్న, సంయుక్త కార్యదర్శులు దేవోజీ భూమేష్, పెద్దకర్రోళ్ల మోహన్, కార్యవర్గ సభ్యులు జంబుల సాయి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

'26 వరకు పరీక్ష ఫీజు చెల్లించాలి'

ఆదిలాబాద్అర్బన్, సెప్టెంబరు19: కాకతీయ విశ్వవిద్యాలయం పరిధిలో డిగ్రీ చదువుతున్న విద్యార్థులు మొదటి మూడు, ఐదు సెమిస్టర్ రెగ్యూలర్, బ్యాక్‌లాగ్ పరీక్ష ఫీ చెల్లింపునకు ఈనెల 26న చివరి తేదీ అని బేల కీర్తన డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ డా.వరప్రసాద్‌రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫీజు సకాలంలో చెల్లిస్తే అపరాధా రుసుము ఉండదన్నాని పేర్కొన్నారు. పూర్తి సమాచారం కోసం కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా.గేడం ప్రవీణ్, పరీక్షల బ్రాంచ్ ఇన్‌చార్జీ సాగర్ లేదా సహాయకులు అనికేత్‌ని గాని సంప్రదించవచ్చని తెలిపారు.



రాజకీయ పార్టీల నాయకులతో మాట్లాడుతున్న సీఈఓ జితేందర్

పంచాయతీ ఎన్నికలకు సిద్ధమవుతున్నాం

- జిల్లా పరిషత్ ముఖ్య కార్య నిర్వాహణాధికారి జితేందర్ రెడ్డి

ఉట్నూర్, సెప్టెంబరు 19: గ్రామ పంచాయతీ ఎన్నికల ఏర్పాట్లు పూర్తి చేసుకొని అధికార యంత్రం ద్వారా ఎన్నికల ఏర్పాట్లుపూర్తి చేసుకుంటున్నామని జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి జితేందర్‌రెడ్డి అన్నారు. గురువవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామ పంచాయతీ ఓటర్ల జాబితా డ్రాఫ్ట్ పబ్లికేషన్ పై మండల స్థాయి రాజకీయ పార్టీ ప్రతినిధులతో సమావేశం ఏర్పాటుచేసి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీ ఎన్నికలు ఎప్పుడు నిర్వహించినా అధికార యంత్రాంగం సిద్ధంగా ఉంటుందని, ఇప్పటికే ఓటర్ల జాబితా ప్రకటించామని అన్నారు. ప్రభుత్వ ఆదేశానుసారం ముందుకెళ్తామని అన్నారు. సమావేశంలో కాంగ్రెస్, బీజేపీ, ఎంఐఎం, గ్రామీణ పేదల సంఘం నాయకులు మహమ్మద్ ఖయ్యూం, కొండేరి రమేష్, రాథోడ్‌శేషరావు, జాహేద్, నేతావత్‌రాందాస్, ఎంపీడీఓ రాంప్రసాద్, ఎంపీఓ మహేశ్‌కుమార్, సూపరింటెండెంట్ శ్యాంసుందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా తప్పుల తడక!

- జిల్లాలో భారీగా 1381 అభ్యంతరాలు
- అభ్యంతరాల స్వీకరణకు దగ్గర పడుతున్న గడువు
- ఆశావహుల పేర్ల గల్లంతుపై గందరగోళం
- పంచాయతీ కార్యదర్శుల పనితీరుపై విమర్శలు
- ఈనెల 29న తుది ఓటరు జాబితా విడుదల



ఓటరు జాబితాను పరిశీలిస్తున్న ఇచ్చోడ గ్రామస్థుడు

ఆదిలాబాద్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాలతో ఓటరు జాబితాను అధికారులు సిద్ధం చేస్తున్నారు. ఈసారి పంచాయతీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు కసరత్తు మొదలుపెట్టారు. ఇప్పటికే ఈనెల 13న గ్రామ పంచాయతీ కార్యాలయాలలో ఓటరు జాబితాను ప్రదర్శించారు. ఆ మరుసటిరోజు నుంచే అభ్యంతరాలను స్వీకరిస్తున్నారు. దీంతో గ్రామ పంచాయతీల్లో కుప్పలు తెప్పలుగా అభ్యంతరాలు వస్తున్నాయి. ఓటరు జాబితా తప్పులతడకగా మారిందంటూ విమర్శలు వస్తున్నాయి. గురువారం సాయంత్రం నాటికి జిల్లావ్యాప్తంగా 1381 అభ్యంతరాలు వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. ఇందులో 211 అభ్యంతరాలకు మాత్రమే పరిష్కారం చూపారు. మిగితా అభ్యంతరాలపై కసరత్తు చేస్తున్నారు. జిల్లాలోని 17 మండలాల్లో మొత్తం 4లక్షల 41వేల 672ఓటర్లు ఉండగా ఇందులో పురుషులు 2లక్షల 16వేల 228 కాగా మహిళలు 2లక్షల 25వేల 429 ఓటర్లు ఉన్నట్లు అధికారిక లెక్కల ప్రకారం తెలుస్తోంది. మరో 15 మంది ఇతరులు ఉన్నారు. గురువారం జిల్లా వ్యాప్తంగా ఆయా మండల పరిషత్ కార్యాలయాల్లో ఓటరు జాబితాపై రాజకీయ పార్టీల నేతలతో సమావేశాలను ఏర్పాటు చేశారు. ఈయేడు ఫిబ్రవరి 2తో పంచాయతీ పాలక వర్గాల పదవీకాలం ముగిసింది. దీంతో ప్రత్యేకాధికారుల పాలనలోనే పంచాయతీ పాలన కొనసాగుతుంది. గత కొద్దిరోజులుగా స్థానిక సంస్థలకు ఎన్నికలను నిర్వహించేందుకు ప్రభుత్వం అవసరమైన ఏర్పాట్లను చేస్తుంది. దీంతో గ్రామాల్లో సందడి వాతావరణం కనిపిస్తోంది. కొన్నిగ్రామాల్లోనైతే ఆశావాహ నేతలు నిత్యం ప్రజల్లో ఉండేలా ప్లాన్ చేసుకుంటున్నారు. ఓటరు జాబితా ప్రదర్శనతో పల్లె రాజకీయాలు మరింత ఊపందుకుంటున్నాయి.

రేపటితో ముగియనున్న గడువు

పంచాయతీల్లో ఓటరు జాబితాను ప్రదర్శించిన అధికారులు మార్పులు చేర్పులపై అభ్యంతరాలను స్వీకరిస్తున్నారు. దీంతో గ్రామాల్లో ఓటరు జాబితా పరిశీలన ముమ్మరంగా కొనసాగుతుంది. అభ్యంతరాల స్వీకరణకు మరో 48గంటల సమయం మాత్రమే మిగిలిఉంది. ఈనెల 21 సాయంత్రం వరకు సంబంధిత గ్రామ పంచాయతీలు, మండల పరిషత్ కార్యాలయాల్లో అభ్యంతరాలను చెప్పేందుకు అవకాశం కల్పించారు. దీంతో గ్రామాల్లో ఓటరు జాబితాను పరిశీలించి తమ పేర్లను సరిచూసు కుంటున్నారు. జిల్లాలో అత్యధికంగా 813 అభ్యంతరాలు ఇచ్చోడ మండలంలో వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. ఉట్నూర్, సిరికొండ, మావల మండలాల్లో అభ్యంతరాలు కనిపించడం లేదు. మిగితా మండలాల్లో వందలోపే అభ్య ంతరాలు కనిపిస్తున్నాయి. వచ్చిన అభ్యంతరాలను పరిశీలించి ఈనెల 26 వరకు పరిష్కరించాల్సి ఉంటుంది. ఆ తర్వాత 29న తుది ఓటరు జా బితాను విడుదల చేస్తారు. గత రెండు, మూడు రోజులుగా గ్రామాల్లో వి నాయక విగ్రహాల నిమజ్జన సందడి కనిపిస్తోంది. దీంతో ఓటరు జాబితా పై అభ్యంతరాలకు మరింత గడువు ఇవ్వాలన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

అసలుకే మోసం

ఓటరు జాబితా ప్రదర్శనతో అసలుకే మోసం వచ్చిందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొన్ని మండలాల్లో అధికారులు విడుదల చేసిన ఓటరు జాబితాలో ఆశావాహుల పేర్లే లేక పోవడం గందరగోళ పరిస్థితులకు దారితీస్తోంది. దీంతో గ్రామాల్లో పలు రకాల అనుమానాలకు తావిస్తోంది. కావాలనే వ్యతిరేక వర్గం వారే పేర్లు తొలగించి ఉంటారన్న చర్చ జరుగుతోంది. కానీ పంచాయతీ కార్యదర్శులు ఓటరు జాబితాను పరిశీలించిన తర్వాతనే గ్రామ పంచాయతీల్లో ప్రదర్శించారు. ఓటరు జాబితాలో తమ పేర్లు లేక పోవడంతో పలువురు ఆశావహ నేతలు అధికారుల వద్దకు ఉరుకులు పరుగులు పెడుతున్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో తమ పేర్లు ఉన్నాయని ఇప్పుడు ఎలా తొలగిస్తారని అధికారులను ప్రశ్నిస్తున్నారు. కొన్ని గ్రామాల్లోనైతే గ్రామ పంచాయతీ కార్యదర్శులతో పలువురు నేతలు ఘర్షణకు దిగుతున్నారు. పరిశీలించకుండానే ఓటరు జాబితాను ఎలా ప్రదర్శిస్తారని తప్పుబడుతున్నారు. అభ్యంతరాలపై దరఖాస్తులు ఇవ్వాలని అధికారులు చెప్పడంతో నిరాశగా వెనుదిరుగుతున్నారు. ఎలాగైనా వచ్చే పంచాయతీ ఎన్నికల్లో పోటీచేయాలని భావించిన కొంత మంది ఆశావాహ నేతల పేర్లు ఓటరు జాబితాలో గల్లంతుకావడంతో ఆందోళనకు గురవుతున్నారు.

అవగాహన లేకనే..

గ్రామస్థాయిలో పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శులకు సరైన అవగాహన లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని అధికారులు చెబుతున్నారు. చాలాగ్రామాల్లో వార్డుల మార్పు, ఓటరుజాబితాలో అసలు పేర్లు లేకపోవడం, ఉన్నాఇతర గ్రామాల్లోకి వెళ్లడం, అలాగే కుటుంబ సభ్యులంతా ఒకే వార్డులో లేకపోవడం లాంటి సమస్యలు ఎక్కువగా కన్పిస్తున్నాయి. ఓటరుజాబితాలో ఉన్న ఓటరుపేరు, ఇంటిపేరు తప్పుగా నమోదు కావడంపై ఓటర్లు అభ్యంతరం వ్యక్తంచేస్తున్నారు. అధికారులు మాత్రం పరిశీలించి పరిష్కారం చూపుతామని చెబుతున్నారు. చాలామంది పంచాయతీ కార్యదర్శులు స్థానికంగా లేక పోవడంతో గ్రామస్థులను గుర్తుపట్టే పరిస్థితి కనిపించడం లేదు. అలాగే కొన్ని మండలాల్లో కొత్త బీఎల్ఓలు సర్వేలు చేయడంతో సమస్యలు ఎదురవుతున్నాయని చెబుతున్నారు. క్షేత్రస్థాయిలో పనిచేసే పంచాయతీ కార్యదర్శులు సక్రమంగా సర్వే చేపట్టి ఉంటే ఇలాంటి పరిస్థితి ఎదురై ఉండేది కాదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఉన్నతాధికారుల ఆదేశాలతో హడావుడిగా పరిశీలించి వదిలేయడంతో ఓటరు జాబితాపై ఎన్నో అభ్యంతరాలు వస్తున్నాయని అధికారులు పేర్కొంటున్నారు.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం..

- శ్రీలత (డీపీఓ, ఆదిలాబాద్)



ఓటరు జాబితా ప్రదర్శించడంతో చాలా గ్రామాల్లో అభ్యంతరాలు వస్తున్నాయి. వెంటనే పరిశీలించి చర్యలు తీసుకుంటాం. ఇప్పటివరకు జిల్లావ్యాప్తంగా 1381 అభ్యం తరాలు వచ్చాయి. దీంతో 211 అభ్యంతరాలకు పరిష్కారం చూపారు. మిగితా 1170 అభ్యంతరాలను పరిశీలించి పరిష్కారం చూపుతాం. 21 సాయంత్రం వరకు అభ్యం తరాలు చెప్పే అవకాశం ఉంది. ఏమైనా మార్పులు చేర్పులు ఉంటే సంబంధిత అధికారులను సంప్రదిస్తే సరిపోతుంది. ఓటరుజాబితాలో పేర్లు లేనివారు ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదు. ఈనెల 26 వరకు పూర్తిస్థాయిలో అభ్యంతరాలను పరిష్కరించి 29న తుది జాబితాను విడుదల చేస్తాం.

గిరిజన పోషణ మిత్ర కార్యక్రమంతో విద్యార్థులకు మెరుగైన వైద్యం

- ఐటీడీఏ పీఓ ఖుష్బు గుప్తా



మాట్లాడుతున్న పీఓ ఖుష్బు గుప్తా

ఉట్నూర్, సెప్టెంబరు 19: గిరిజన విద్యార్థులకు మెరుగైన వైద్య, విద్యనందించాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బు గుప్తా అన్నారు. ఉమ్మడి జిల్లాలోని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారులు, గిరిజన సంక్షేమ శాఖ డీడీలు, డీటీడీఓలు, ఆశ్రమ పాఠశాల ఏఎన్ఎంలకు, వార్డెన్‌లకు బుధవారం రాత్రి కొమురంభీం ప్రాంగణంలోని పీఎంఆర్సీ సమావేశమందిరంలో నిర్వహించిన గిరిజన పోషణమిత్ర కార్యక్రమంలో మాట్లాడారు. విద్యార్థులకు అందిస్తున్న వైద్యంలో రక్తహీనత లేకుండా రక్తపరీక్షలు నిర్వహించాలని 4జిల్లాల డీఎంహెచ్ఓలు ఏజెన్సీ వైద్యఆరోగ్యశాఖ అధికారిలకు తెలిపారు. రక్తంలో హిమాగ్లోబిన్‌శాతం రిజిస్టర్‌లో నమోదుచేసి తక్కువ ఉంటే పరీక్షించాలని, 4శాతం కన్న తక్కువ ఉంటే అభివృద్ధి చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు ప్రతీరోజు కచ్చితంగా మెనూ ప్రకారం పోషణ విలువలు గల కూరగాయలు, గుడ్లు, మునగకాయ, ఇప్పపువ్వు లడ్డు, పల్లి పట్టి, అందించాలన్నారు. ప్రతినిత్యం పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ప్రతీరోజు వంటగది, స్టోర్‌రూమ్, తాగునీరు, మరుగుదొడ్లు శుభ్రంగా ఉండేలా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అలాగే భోజనంలో అన్ని కూరగాయలు ఉండేలా చూడాలని ఏటీడీఓలకు సూచించారు. ఉద్యానవన నర్సరీల ద్వారా ఆశ్రమ పాఠశాల వంటగది ఆవరణలో విటమిన్ గల కొత్తమీరా, కరివేపాకు వంటి మొక్కలు నాటాలని అన్నారు. అలాగే యూనిట్ అధికారులు 1,2 ఆశ్రమ పాఠశాలను దత్తత తీసుకోవాలని తెలిపారు. ఏమైనా మరమ్మత్తులు ఉంటే తమకి తెలియజేయాలని అన్నారు.

పెరటికోళ్ల పెంపకంతో ప్రత్యామ్నాయ ఆదాయం: ఎమ్మెల్యే



పెరటి కోళ్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బొజ్జుపటేల్

ఉట్నూర్, సెప్టెంబరు19: గ్రామీణ ప్రాంతాల్లోని రైతులకు నిరుద్యోగులకు పెరటి కోళ్ల పెంపకంతో ఉపాధితో పాటు ప్రత్యామ్నాయ ఆదాయం లభిస్తుందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జుపటేల్ పేర్కొన్నారు. గురువారం ఉట్నూర్ మండలంలోని కల్లూరుగూడ గ్రామంలో భావ్యపారం కోళ్ల పరిశోధన సంచనాలయం హైదరాబాద్ వారిచే 360 పెరటి కోళ్లు, 100 ఇనుపతో తయారుచేసిన ఇళ్లను పంపిణీచేశారు. ముందుగా సంస్థ శాస్త్రవేత్తలు పెరటి కోళ్ల పెంపకంపై వాటి పెంపకం వల్ల కలిగే లాభాల గురించి గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పెరటికోళ్ల పెంపకంతో అధికలాభాలు ఉంటాయని పేర్కొన్నారు. ఈకోళ్లు అధిక బరువు కలిగి ఉంటాయని, దీంతోపాటు అధిక మాసం, గుడ్లనిస్తాయన్నారు. స్వయం ఉపాధి పొందేందుకు సర్కారువారు పెరటి కోళ్ల పెంపకంతో శిక్షణ ఇస్తారని ప్రతీఒక్కరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పెరటికోళ్ల పెంపకంతో అధిక నికర ఆదాయం వస్తుందని తెలిపారు. ఇందులో వనరాజ, రాజశ్రీ, శ్రీనిది ఇలా పలు రకాల కోళ్లు ఉంటాయని పేర్కొన్నారు. నాటుకోళ్లతో పోల్చితే పెరటి కోళ్లు అతితక్కువ రోజులో పెరుగుతాయన్నారు. నిరుద్యోగ యువత, రైతులు పెరటి కోళ్ల పెంపకం పై దృష్టి సారించి స్వయం ఉపాధి పొందాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సి పాల్ సైంటిస్టు, డా.బిప్రకాష్, డా.రాజకుమార్, డా.విజయ్‌కుమార్, టెక్నికల్ ఆఫీసర్ ఎస్కే. బాంజా, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ బార్గవ్, గ్రామస్థులున్నారు.

వినాయక నిమజ్జనాన్ని ప్రశాంతంగా జరుపుకోవాలి

- బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్

నేరడిగొండ, సెప్టెంబరు19: వినాయక నిమజ్జనాలను ప్రజలు ప్రశాంతంగా జరుపుకోవాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోగల పెద్ద హనుమాన్ తేజాపూర్ గ్రామంలో గల వినాయకుడి మండపాల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. యువకులు ప్రశాంత వాతావరణంలో వినాయకున్ని నిమజ్జనం చేయాలన్నారు. ఆయనవెంట వీడీసీ చైర్మన్ రవీందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ రాథోడ్‌సజన్, నాయకులు ఉన్నారు.

పాఠశాల విద్య బలోపేతం కోసం కృషి

నేరడిగొండ, సెప్టెంబరు 19: నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యబలోపేతం కోసం తనవంతు కృషిచేస్తానని కాంగ్రెస్ పార్టీ బోథ్ నియో జకవర్గ ఇన్‌చార్జీ ఆడే గజేందర్ అన్నారు. మండలంలోని తేజాపూర్‌లో జడ్పీఎస్ఎస్, ఎంపీపీఎస్, పాఠశాలల ప్రహరీ నిర్మాణానికి పూజచేసి పనులను ప్రారంభించారు. ఆయనవెంట నాయకులు గంగారెడ్డి, ప్రపుల్‌రెడ్డి, ఆడేవసంత్‌రావ్, రాజశేఖర్‌రెడ్డి, తదితరులున్నారు.

అనుమతి లేకుండా ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తే చర్యలు: కమిషనర్

ఆదిలాబాద్‌రూరల్, సెప్టెంబరు19: ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ స్థలాలు, రోడ్డు డివైడర్ల మధ్య, కూడళ్లలో ఎలాంటి ఫ్లెక్సీలు ఏర్పాటు చేయొద్దని మున్సిపల్ కమిషనర్ ఖమర్‌అహ్మద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎవరైనా అనుమతి లేకుండా ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తే చర్యలు తీసుకోబడతాయని స్పష్టంచేశారు.

ఓటరు జాబితాపై సమావేశం

ఆదిలాబాద్‌రూరల్, సెప్టెంబరు19: ఆదిలాబాద్‌రూరల్ ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో నాగేశ్వర్ వివిధ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. గ్రామ పంచాయతీలో వార్డుల వారీగా ఓటర్ల సవరణ, అభ్యంతరాలపై గ్రామ పంచాయతీ కార్యదర్శిగా వినతి పత్రంఇచ్చి మార్పులు చేర్పులు చేసుకోవాలని సూచించారు. ఈనెల 26వ తేదీ వరకు మార్పులు చేర్పులకు అవకాశం ఉందని అన్నారు. అలాగే రాజకీయ నాయకుల నుంచి అభ్యంతరం స్వీకరించారు.

ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మిద్దాం

- చిన్నారికి అన్నప్రాసన కార్యక్రమంలో కలెక్టర్ రాజర్షిషా
- ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్

నేరడిగొండ, సెప్టెంబరు 19: మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జాతీయ పోషణ మాసంలోభాగంగా నేరడిగొండ మండలం చించోలిలో ఏర్పాటుచేసిన అన్నప్రాసన, సీమంతం కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొని చిన్నారికి అన్నప్రాసన చేశారు. మహిళలు భాగుంటేనే దేశం బాగుంటుందని, పోషకాహారంతోనే ఆరోగ్యసమాజం నిర్మితమవుతుందని అన్నారు. గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు రక్తహీనత నివారణకు పోషకాహారం తీసుకోవాలని కోరారు. అలాగే తినే ముందు చేతులు శుభ్రంగా కడగాలన్నారు. చిన్నారులకు మొదటిబడి అంగన్‌వాడీ కేంద్రాలే అయినందున వారికి క్రమశిక్షణ, శుభ్రత, మంచి నడవడిక నేర్పించాలన్నారు. పోషక విలువలతో కూడిన ఆహారంతోపాటు తగిన వైద్యపరీక్షలు చేసుకోవాలని అవసరమైన చికిత్సలు తీసుకోవాలని సూచించారు. అనంతరం మొక్కలు నాటారు. అంతకుముందు సాంప్రదాయ పద్ధతిలో కలెక్టర్‌ని స్వాగతం పలికారు. అనంతరం నేరడిగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అకస్మీకంగా తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. రికార్డులు పక్కాగా ఉండాలని లేకుంటే చర్యలు తప్పవని వైద్యాధికారి సద్దాంను హెచ్చరించారు. అనంతరం గ్రామంలోగల బావిని కుడిపివేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంఆర్ఓ కలీం, ఏఎస్‌డీ పీఓ మిల్కా, సీడీపీఓ, సౌందరయ్య, ఎంపీడీఓ రాజ్‌వీ ర్, మండల ప్రత్యేకాధికారి రవిశంకర్, జిల్లా పౌరసం బంధాల అధికారి తిరుమల, ఎంపీఓ లక్ష్మణ్, మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, వీడీసీచైర్మన్ రవీందర్ రెడ్డి, సూపర్‌వైజర్, అంగన్‌వాడీ టీచర్, గ్రామస్థులు పాల్గొన్నారు.



చిన్నారికి అన్నప్రాసన చేస్తున్న కలెక్టర్

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అకస్మీకంగా తనిఖీ చేసిన కలెక్టర్

ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా ప్రజలకు మరింత మెరుగైన వైద్యసేవలు అందించాలని కలెక్టర్ వైద్యాధికారులను ఆదేశించారు. గురువారం నేరడగొండలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని అకస్మీకంగా తనిఖీచేసి ఓపీ, స్టోర్‌రూం, ఇన్‌పేషేంట్ వార్డు, ఆన్‌లైన్‌లో స్టాక్, ఆసుపత్రిలో వైద్యుల, సిబ్బంది హాజరు, డెలవరీ రిజిస్టర్, డైట్, డిశ్చార్జ్ పరిశీలించారు. ఓపీ ఎలా ఉంది, ఆసుపత్రి ద్వారా సేవలు ఎలా అందిస్తున్నారని, ఈనెల ఎన్ని ప్రసవాలు జరిగాయి. ఫివర్ కేసుల గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రతీ రిజిస్టర్, రికార్డులు ఆసుపత్రిలో ఉండాలని, ప్రతీదీ రిజిస్టర్‌లో నమోదు చేయాలని, రిజిస్టర్‌లు, రికార్డు లు సరిగా లేవని క్రమం తప్పకుండా ప్రతీరోజు రాయాలని, అవసరమైన మందులు వెంటవెంటనే తెప్పించుకోవాలని, ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆదేశించారు. అనంతరం జనవాసాల మధ్య ఉన్న ఓపెన్ వెల్‌ను పరిశీలించి ప్రత్యేక అధికారి ఏడీ మైనింగ్‌కి ఓపెన్ వెల్ క్లోస్ చేసేందుకు చర్యలు తీ సుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, వీడీసీ చైర్మన్ రవీందర్‌రెడ్డి, మండల ప్రత్యేక అధికారి రవిశంకర్, ఎంపీడీఓ రాజ్ వీర్, ఎంపీఓ లక్ష్మణ్, ఇతర అధికారులు ఉన్నారు.



సీమంతంలో పాల్గొన్న కలెక్టర్